కేజీబీవీ భవనం పూర్తయ్యేదెన్నడో ?

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల
- ఇబ్బందుల్లో విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు


కేజీబీవీ నూతన భవనం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీ భవన నిర్మాణ పనులు గత నాలుగేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం నూతన మండలాల ఏర్పాటులో భాగంగా ముప్కాల్ మండల కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. 2017లో మండల కేంద్రానికి కేజీబీవీ మంజూరు కాగా నాటి నుంచి అద్దె భవనంలో కొనసాగుతోంది. 2021లో గత ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ. 3కోట్ల50 లక్షల నిధులను మంజూరు చేసింది. అదే ఏడాది భవన నిర్మాణ పనులకు నాటి పాలకులు శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

కాంట్రాక్టర్ పనులను సరిగా చేపట్టకపోవడంతోనే ఆలస్యమవుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం కిటికీల బిగింపు పనులు సాగుతున్నాయి. ప్లంబింగ్, కరెంట్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గత నాలుగేళ్లుగా పనులు అసంపూర్తిగా ఉన్నా అధికారులు కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చెల్లించాల్సిన బిల్లులను చెల్లించక పోవడంతోనే పనులు ముందుకు సాగడం లేదని సమాచారం. దీంతో అధికారులు కూడా కాంట్రాక్టర్‌పై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేని దుస్థితి ఉంది.

అద్దె భవనంలో వసతులు కరువు

కేజీబీవీ ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇందులో 200 మంది విద్యార్థినులు 6 నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. అద్దె భవనంలో కనీస వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యాలు సరిగా లేవని విద్యార్థినులు పేర్కొంటున్నారు. పేదింటి బిడ్డలం కావడం వల్లే ప్రభుత్వం తమపై చిన్న చూపు చూస్తోందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు.

ఏప్రిల్ వరకు పూర్తి చేస్తాం

ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీ నూతన భవన నిర్మాణ పనులను ఏప్రిల్ వరకు పూర్తి చేస్తాం. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నూతన భవనంలోనే జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. పనులు వేగవంతమయ్యేలా చర్యలు చేపడుతాం.

– మురళి, ఏఈ, నిజామాబాద్

క్లుప్తంగా

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



వర్ని(చందూర్): విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని దేశాభివృద్ధికి తోడ్పాడటును అందించాలని హైకోర్టు అడ్వకేట్ సరళ అన్నారు. శనివారం చందూర్ మండల కేంద్రంలోని శ్రీ సాయి విద్యాలయంలో ట్రస్మా, ఇస్రో, డీఆర్డీవో, ఎన్ఆర్ఎస్‌సీ, డీఆర్‌డీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు అణ్వాయుధాల ప్రదర్శన, అవగాహన సదస్సు నిర్వహించారు. అణ్వాయుధాలు, ఇతర పరికరాలను విద్యార్థులకు చూయించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, అరుణ్, మధు, జనార్దన్, నగేశ్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై అవగాహన



పెర్కిట్: పెర్కిట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చెత్త నిర్వహణ, కుక్క కాటుపై అవగాహన కల్పించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ తడి, పొడి చెత్త, హానికర చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. అలాగే కుక్కలతో ఎలా వ్యవహరించాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, పూర్ణమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



వేల్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయడాన్ని నిరసిస్తూ వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో శనివారం మాల పెద్దసంఘం సభ్యులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని ఎస్సీ వర్గీకరణను తెలంగాణలో మాత్రమే రేవంత్‌రెడ్డి అమలులోకి తెస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాలసంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



వేల్పూర్/ బాల్కొండ: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో శనివారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి సమక్షంలో మేతరి లక్ష్మి మంజూరైన రూ. 22 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుడాల మోహన్, టక్కరి గంగాధర్, గట్టువుతల నర్సారెడ్డి, మోహన్, ఎం భోజన్న, కార్యకర్తలు పాల్గొన్నారు. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన ఆరుగురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



బోధన్: సాలూర మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం బాలిక సాధికారిత కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాలూర గ్రామానికి చెందిన శ్రీ రామ గ్రామీణ బ్యాంక్ శంకరంపేట్ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ మైదపు భూమయ్య కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలు, ఆర్థిక క్రమశిక్షణ, బాలికల పొదుపు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజీ మంజుషా, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, విజయలక్ష్మి, శోభారాణి, అరుణ్ కుమార్, విఠల్ కాంబ్లె, లక్ష్మి, అంజన, వనజ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి గణిత ఒలింపియాడ్‌కు ఎంపిక

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని న్యూ హారిజన్స్ పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థులు జాతీయ స్థాయి గణిత ఒలంపియాడ్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం చంద్ర విలాస్ తెలిపారు. శనివారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎఫ్ భూలబ్ధిదారులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న ఆనంపల్లి ఎల్లయ్య

బోధన్: ఎన్‌ఎస్‌ఎఫ్ భూలబ్ధిదారులను ఆదుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు, బోధన్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆయన మాట్లాడారు.1994 నుంచి మూడు విడుతల్లో ఫ్యాక్టరీ కూలీలు, అర్హులైన వివిధ సామాజిక వర్గాల నిరుపేదలకు సుమారు 6 వేల ఎకరాలను గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేశారని అన్నారు. ఇందులో కొందరు తమకు కేటాయించిన భూములకు రిజిస్ట్రేషన్ చేయించుకోలేక పోయారని, మరి కొందరు ఆర్థిక పరిస్థితులు బాగా లేక ఇతరులకు అమ్ముకున్నారని తెలిపారు. ఫ్యాక్టరీ భూముల రిజిస్ట్రేషన్లను జిల్లా అధికార యంత్రాంగం ఏడాదిగా నిలుపుదల చేసిందన్నారు. కలెక్టర్ స్పందించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయించి ఇవ్వాలని కోరారు. నాయకులు మిర్జాపూర్ సాయన్న, బాల్‌రాజ్, సాయిలు, అబ్బయ్య, ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు వేయించాలి


మాట్లాడుతున్న వైద్యుడు వినయ్‌కుమార్

రెంజల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని రెంజల్ పీహెచ్‌సీ వైద్యుడు వినయ్‌కుమార్ తెలిపారు. శనివారం రెంజల్, నీలా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నులి పురుగుల వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించారు. మండలంలో 19 ఏళ్ల లోపు ఉన్న 8340 మంది పిల్లలకు మాత్రలు అందించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈవో ఆంజనేయులు, సోమలింగంగౌడ్, చింతల శ్రావణ్‌కుమార్, రవీందర్, అశ్వర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మోపాల్: మండలంలోని కంజర్ శివారులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం సిరివల్లి ఢిల్లీ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ జి విజయలలిత తెలిపారు. సిరివల్లి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకే కాకుండా జిల్లాకే గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థిని ఎం సిరివల్లిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ ఉదయశీల, ఎస్‌వీపీ వినోద, జేవీపీ సునీత, పీఈటీ లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాకారుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

డొంకేశ్వర్: తెలంగాణ సాంస్కృతిక కళా సంస్థ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 11న నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి నిజామాబాద్ జిల్లా కళాకారులు తరలిరావాలని టీఎస్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు పొగరి సంజీవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి వివిధ శాఖల మంత్రులతో పాటు సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల గద్దర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కూచిపూడి, ఒగ్గుడోలు, దీంసా, గుస్సాడి నృత్యాలతో పాటు ప్రాచీన కళలైన చిందు, యక్షగానం కళారూపాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి ఔత్సాహిక కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చి జిల్లా ఖ్యాతిని చాటాలన్నారు. కళాకారులకు అవార్డు ప్రధానోత్సవం ఉంటుందన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



రెంజల్: బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం) అధికారి విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. రెంజల్‌లోని కేజీబీవీలో శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థినులకు పలు సూచనలు, సలహాలు అందించారు. చర్మ వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. కేజీబీవీ నిర్వాహకురాలు శ్యామల, సిబ్బంది స్రవంతి, స్వరూప, రూప, శ్రీలత పాల్గొన్నారు.

సన్మానం

వేల్పూర్: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన రొక్కం మురళిని శనివారం మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, నాయకులు టక్కర్ గంగాధర్, నర్సారెడ్డి, దామోదర్‌గౌడ్, రమణ, భగవాన్‌దాస్, జేమ్స్‌గంగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ఉద్యోగాల భర్తీ

- పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి


ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

ఆర్మూర్/ బోధన్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 55 వేల ఉద్యోగాల భర్తీతో నిరుద్యోగులకు అండగా నిలిచిందని నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ బీ ఫాం తీసుకున్న అనంతరం నిర్వహిస్తున్న ర్యాలీలో భాగంగా శనివారం ఆర్మూర్‌లో పర్యటించారు. ప్రస్తుత ఎన్నికల ప్రచారాన్ని రిలాక్స్‌గా నిర్వహించడమే కాకుండా ఎమ్మెల్సీగా విజయం సాధించి సీఎం రేవంత్‌రెడ్డికి గిఫ్ట్ రూపంలో ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, అయ్యప్ప శ్రీనివాస్, షేక్ మున్ను, లింగాగౌడ్, జీవన్‌రెడ్డి, విజయ్, మహిపాల్, రవి, భూమేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, గంగాశంకర్, నాగేశ్వర్‌రావు, ఎస్ఎన్ రెడ్డి, కొడాలి కిశోర్‌కుమార్, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్

- బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. శనివారం సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్ రజతోత్సవ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. చదువులో ప్రతిభ చాటి మెడిసిన్ సీటు సాధించిన పూర్వ విద్యార్థులు, పది జీపీఏ మార్కులు సాధించిర విద్యార్థులను సబ్ కలెక్టర్ సన్మానించారు. అతిథులను పాఠశాల డైరెక్టర్ మిద్దెల రాజు, కరస్పాండెంట్ లతా రాజు సన్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ శశిభూషణ్, ఎంఈవోలు నాగయ్య, మంజూషా, లోల శంకర్, పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, అల్లె జనార్దన్, సీఐలు వెంకట నారాయణ, విజయబాబు, ఎస్సై మచ్చేందర్ రెడ్డి, కొడాలి కిశోర్, జయప్రకాశ్, వై శ్రీనివాస్‌రావు, సూర్య ప్రకాశ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

వేల్పూర్: విత్తనోత్పత్తి సంస్థలు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద విత్తన ధ్రువీకరణ కార్యాలయ ఆవరణలో శనివారం సేంద్రియ ధ్రువీకరణపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే లక్ష్యంతో సంస్థ పనిచేస్తోందన్నారు. శాస్త్రవేత్తలు, విత్తన ధ్రువీకరణ అధికారులు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు వివిధ పంటల్లో విత్తనోత్పత్తిలో పాటించాల్సిన మెలకువల గురించి వివరించారు. కార్యక్రమంలో విత్తన ధ్రువీకరణ అథారిటీ డైరెక్టర్ కేశవులు, రొక్కం మురళి, సంజీవరెడ్డి, రాజేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దిగంబర్‌రావు

బోధన్‌టౌన్: ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని మాతృశ్రీ విద్యాసంస్థల చైర్మన్ దిగంబర్ రావు అన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో పాఠశాల ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యావికాస్ జూనియర్ కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, సుభాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

విగ్రహాల ఊరేగింపు



వర్ని: మండలంలోని కూనిపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం యజ్ఞం, హోమం, ప్రత్యేక పూజలు చేపట్టారు. విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మూడు రోజులపాటు విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు ప్రారంభం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జాతరోత్సవాలు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఆలయంలో ఉత్సవమూర్తులకు సుప్రభాత సేవ, గణపతి పూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, శివసరపు గణేశ్, జైడి బాలు, బుచ్చి మల్లయ్య, బాలకిషన్, నిమ్మ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ శివారులోని రంగనాథ స్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ప్రతి నెల రెండవ శనివారం అన్నదానం నిర్వహిస్తారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, సభ్యులు, అన్నదాత ఆరే గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో ప్రత్యేక పూజలు



పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలో వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. నిర్మాణ స్థలం వద్ద శనివారం నందిపేట కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు


బాల్కొండలో సంబురాలు నిర్వహిస్తున్న నాయకులు


బోధన్ పట్టణంలో..


కోటగిరిలో స్వీట్లు తినిపిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజవర్గాల్లో బీజేపీ నాయకులు శనివారం సంబురాలు నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెనుకబడిన గ్రామాలను దత్తత తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్ చటర్జీ

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ శంకర్ చటర్జీ హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ సంస్థల్లో స్థిరపడ్డ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు వెనుకబడిన గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అలాగే కళాశాలకు గొప్ప పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో గరిగిపాటి శ్రీనివాస్, రామ సావిత్రి, సౌమిత్రి లక్ష్మణాచార్య, ప్రిన్సిపాల్ ఆర్‌కే పాండే, కళాశాల యాజమాన్యం అల్జాపూర్ శ్రీనివాస్, ఎ దేవేందర్, ఎ గంగాధర్, ఎ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డైమండ్ జూబ్లీ వేడుకలు



బోధన్: పట్టణ కేంద్రంలోని విజయ మేరి హైస్కూల్ డైమండ్ జూబ్లీ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాటు ఏఎంసీ చైర్‌పర్సన్ అంకు సంధ్య దామోదర్, ఎంఈవో నాగయ్య, టౌన్ సీఐ వెంకట నారాయణ హాజరయ్యారు. అతిథులను పాఠశాల నిర్వాహకులు సన్మానించారు. హెచ్‌ఎం సిస్టర్ బెలిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళాలు అందజేత

రుద్రూర్: మండలంలోని వివిధ ఆలయాల అభివృద్ధికి మాజీ వార్డు సభ్యుడు భూమా గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఆయన కుమారులు శ్రీధర్‌గౌడ్, సంతోష్‌గౌడ్ ఒక్కో ఆలయానికి రూ. ఐదు వేలు చొప్పున విరాళంగా అందజేశారు. పునరుద్ధరణ పనులు కొనసాగుతున్న రాజరాజేశ్వర స్వామి ఆలయం, నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామ ఆలయం, శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయం, గంగమ్మ మందిరానికి విరాళాన్ని అందించారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	భవాని వార్డ్-1997(తెలుగు)-12.30; సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 3.10 9.00; ఒక పథకం ప్రకారం(తెలుగు)-6.10
స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం - 10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-3	పట్టుదల (తెలుగు) -10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-4	తండేల్(తెలుగు) - 10.00, 1.05, 4.10, 7.15, 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	తండేల్(తెలుగు)-11.00 1.45 4.40 7.35 10.30
స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం - 1.30, 7.30
స్క్రీన్-3	పట్టుదల(తెలుగు)-11.00, 1.40, 4.30, 7.20, 10.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం - 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	పట్టుదల (తెలుగు) - 10.05 1.15 4.25 7.35 10.45
స్క్రీన్-3	స్కై ఫోర్స్ (హిందీ) - 10.15; డాకు మహారాజు - 1.00, 7.20; దేవా (హిందీ) - 4.05, 10.25
స్క్రీన్-4	దేవా (హిందీ) - 10.00, 7.10; స్కై ఫోర్స్ (హిందీ) - 1.15, 10.25; మదగజరాజ (తెలుగు) - 4.00
లలితామహల్	తండేల్(తెలుగు)-11.00, 2.00, 6.00, 10.00
దేవి	పట్టుదల (తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00
నటరాజ్	బాదాస్ రవికుమార్(హిందీ)-11.00, 2.00, 6.00, 10.00
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం - 10.30, 2.15, 6.10, 10.05

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	87,100	వెండి(కిలో)	99,500
22 క్యారెట్స్	80,382		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800